కథ

# ఆఖరి కోరిక

ఎన్.కె.రామారావు

**సెషన్సు జడ్జి వృషాకపి తన ఎదురుగా నిలుచున్న పాతికేళ్ళ పుళిందను తేరిపార చూశాడు. కోర్టు హాలు కిటకిటలాడుతోంది. ''అమ్మాయి! నీ అత్త గారిని విషంపెట్టి చంపావని నీ మీద అభియోగం. నేరం వప్పుకుంటావా లేక సాక్షులను ప్రవేశపెట్ట మంటావా?''**

''సాక్షులక్కర్లేదు. వాళ్ల బొంద. ఏం చూశారని సాక్ష్యం చెబుతారు. నేను మా అత్తగారికి విషమిచ్చి చంపిన మాట ముమ్మాటికీ నిజం. మీ మీదొట్టు'' పుళింద నిర్భయంగా చెప్పింది.

వృషాకపితో సహా అందరూ వులిక్కిపడ్డారు. ఒక ప్లీడరు గుమాస్తా బలే సంతోష పడ్డాడు. తన మామగారు చనిపోయిం తర్వాత తన ఇంట్లో తిష్ట వేసిన అత్తగారిని లేపేయాలని బహుతొందర పడుతున్నాడు. ధైర్యం చాలడం లేదు. పుళిందను చూసి ఈమె అత్యంత సాహసి అతిలోక అతివ. ఈమె చిరంజీవిగా వర్ధిల్లాలి నిండు మనసుతో నిశ్శబ్దంగా దీవించాడు.

''అంత ధైర్యంగా – అంటే – అసలు ఆ విషం తన పని సవ్యంగా చేస్తుందనే – ఏ నమ్మకంతో ఆ పని చేశావు అమ్మాయీ!'' వృషాకపి తాపీగా అడిగాడు.

''ఫలానా సబ్బు మరకలు పోగొడుతుందో లేదోనని అనుమాన పడవచ్చు. ఈ విషం విషయంలో అలాంటి అనుమానమక్కర్లేదు. ఎందుకయినా మంచిదని ముందు మా పెంపుడు కుక్కకు తాగించాను. అది నా వైపు జాలిగా చూస్తూ ప్రాణాలొదిలింది.''

మళ్ళీ అంతా యధావిధిగా ఉలిక్కిపడ్డారు. పి.పి.లేచి కుక్కను చంపిన అభియోగం కూడా అదనంగా చేర్చమని ప్రాధేయ పడ్డాడు.

భారతీయ శిక్షా స్మృతిలో కుక్కను గానీ మరే పెంపుడు జంతువును కానీ ఉద్దేశపూర్వకంగా చంపితే ఏ సెక్షను క్రింద శిక్షించవచ్చో తెలుపుతే తప్పకుండా అలాగే చేద్దామన్నాడు వృషాకపి. ఇండియన్ పీనల్ కోడ్ మొత్తం పి.పి మనోనేత్రాల ముందు గోచరించింది. పేజీలు వాటికవే తిరిగి పోతున్నాయి. కానీ కావాల్సిన సెక్షన్ తగల్లేదు.

''కుక్క ముండమొయ్యా. దాని సిగతరిగిరి. సెక్షన్ తగల్లటం లేదు. అత్తగారిని చంపిన దాని గురించి ఆలోచించండి.'' పి.పి. వినయంగా విన్నవించుకున్నాడు.

''అమ్మాయీ! మీ అత్తగారిని ఎందుకు చంపవలసి వచ్చిందో చెబుతావా?''



''ఏం చెయ్యమంటారు? నా కార్పోరేటు బిజినెస్‌లో నాకు అడుగడుగునా అడ్డం తగులు తున్నది. నేను ఫోన్లో మాట్లాడుతుంటే చాటుగా వింటున్నది. నా బిజినెస్ ప్రత్యర్థులకు ఫోన్ చేసి నా గుట్టుమట్లు చెప్పేస్తున్నది. ఎలాగోలా నా వ్యాపారం లాక్కోవాలని చూస్తున్నది. ఇలా చేస్తే మీరు మాత్రం సహిస్తారా చెప్పండి.'' ఒక్క గర్జనతో వృషాకపిని నిలదీసింది.

మళ్ళీ కోర్టు హాలంతా నివ్వెరపోయింది. ఈవిడను చూద్దామా మధ్యతరగతి మహిళ. కార్పోరేట్ బిజినెస్ ఎక్కడిది – ఈవిడ ఎత్తులకు అత్తగారి పై ఎత్తులెక్కడివి. వృషాకపి అదే విషయం అడిగాడు.

''సరే, నీ ఆనర్ చెబుతా''

''నీ ఆనర్ అనకూడదమ్మా. అంటే యువర్ ఆనర్ అనాలి. లేకున్నా మరేం కొంప మునిగిపోదు. నీ ఆనర్ అని జడ్జిగారి మనసుకు ముల్లులా గుచ్చుకునే మాట అనద్దు.'' పి.పి. సలహా ఇచ్చాడు.

''అలాగా. సరే. రేపు నేను కార్పోరేటు బిజినెస్ పెట్టకపోతానా! ఈవిడ బతికుంటే నా కద్దుతగలదా! శత్రువును ముందు చూపుతో మట్టుపెట్టాలని నా అభిమాన హీరో కరంజిత్ ఒక సిన్మాలో అన్నాడు.''

''అయితే ఇంకా బిజినెస్ మొదలెట్ట లేదన్నమాట''

''లేదు''

''మరి అమాయకప్పక్షి మీ అత్తగారెలా అడ్డు తగులు తుందమ్మా'' వృషాకపికి అసహనం పెచ్చరిల్లుతోంది.

''మరి నేను నాలుగేళ్ళ మూణ్ణెల్లుగా చూస్తున్న టి.వీ. సీరియల్ చక్ర వక్రం – వక్రచక్రంలో అత్తా కోడళ్ళు అలాగే చేస్తున్నారుగా''

''హసిని. నీదుంపతెగ. సీరియళ్ళు సినిమాలు చూసి ఇలా కూడా మారొచ్చన్న మాట. నిన్ను క్షమించడానికి వీలు లేదు. నీకు తక్కువ శిక్ష వేస్తే సమాజానికి తప్పుడు సంకేతాలు వెళతాయి. అత్తగార్లు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని బతకాల్సి వస్తుంది. నిన్ను క్షమించను కాక క్షమించను. రేపెప్పుడైనా అమాయకప్పిండమైన నీ మొగుణ్ణి కూడా చంపవని గ్యారంటీ ఏమిటి?''

''గ్యారంటీ ఏమీ లేదండి. బలే కనుక్కున్నారు. నారెండో లక్ష్యం నా మొగుడేనండి. సీరియల్లో అలాగే జరిగిందండి.''

''ఛీ.ఛీ. దురాత్మురాలా. మొగుణ్ణి, అత్తనూ చంపి ఆ బిజినెస్ చేసి ఏం వెలగబెడతావే.'' వృషాకపి తీవ్రంగా అడిగాడు.

''ఈవిడ అనగా పుళింద ఇంకా కార్పోరేట్ బిజినెస్ కాదు కదా కాకా హోటల్ కూడా మొదలెట్టలేదనే విషయం కోర్టు వారు దృష్టిలో వుంచుకోవాలి.'' పి.పి. మళ్ళీ మనవి చేశాడు.

''అవునవును. దురాత్మురాలా నిన్ను ఏం చేసినా పాపం లేదు. నీకు ఉరిశిక్ష విధిస్తున్నాను. నీ మెడకు తాడు వేసి ఉరికొయ్య మీద నీ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసే దాకా నిన్ను ఉరిదీతురు గాక. ముందు జాగ్రత్త చర్యగా నీ శవాన్ని రెండు గంటల పాటు గాల్లో వేలాడే విధంగా ఉరికంబానికే వుంచుదురు గాక'' శిక్ష వినిపించాడు.

''అదేమిటి. నేరం వప్పుకుంటే మొదటి తప్పు క్రింద మందలించి వదిలేస్తారటగా'' పుళింద నిబ్బరంగానే అడిగింది.

''ఏమిటి. మర్డరు కేసులో మందలించి వదిలి వేయటమా! అలా చేసిన ఒక్క జడ్జి పేరు హాక్క పేరు చెప్పు చేతవుతే. నేనదేమిటో కనుక్కుంటాను వాడి సంగతి చూస్తాను.'' వృషాకపి కోపాన్ని సాధ్యమయినంత అదుపులో పెట్టుకున్నాడు.

''చక్ర వక్రం – వక్ర చక్రంలో న్యాయమూర్తి అలాగే చేశాడు''

వృషాకపి కోపంతో ఆపాదమస్తకం కంపించాడు. ''ఈ పాపిష్టి నేరస్తురాలిని తక్షణం ఇక్కడ నుంచి తీసుకెళ్ళండి''

పోలీసులు పుళిందను లాక్కెళ్ళిపోయారు. ''హమ్మయ్య. తింగిరిబొంగిరిదానా నీ పీడ వదిలిపోయింది''

పుళింద భర్త ప్రేక్షకుల నుంచి కోర్టు బయటికి ఆనందంగా వెళ్ళిపోయాడు. తనకిప్పుడు ప్రాణ భయం లేదు. ఆ సంతోషంలో ఈల వేసుకుంటూ గోల్డు ఫ్లేకు సిగిరెట్టు కొనుక్కొని 'భలేమంచి రోజు' పాడుకుంటూ వెళ్ళిపోయాడు.

పదిహేనేళ్ళు గడిచిపోయాయి. వృషాకపి న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశాడు. ఎంత యోగా చేసినా ప్రాణాయామం చేసినా, జబ్బులు ఆ కాసేపు తగ్గినట్లనిపించి తిరిగి వచ్చేస్తున్నాయి. రాష్ట్రంలో చాలా మార్పులొచ్చాయి. చాలా పార్టీలొచ్చాయి. చాలా పత్రికలు, చాలా టీ.వీ. ఛానెళ్ళూ వ చ్చాయి. ఎక్కడ చూసినా అభివృద్ధి ఆనంద తాండవం చేస్తోంది.

అధికారంలో వున్న ప్రభుత్వం జైళ్ళ సంస్కరణలకు ఒక కమిటీని నెలకొల్పి రిటైర్డు జస్టిస్ వృషాకపిని ఛైర్మనుగా నియమించింది. క్షమాభిక్షకు అర్హులైన ఖైదీల పట్ల ప్రత్యేక దృష్టిని సారించమంది. జైళ్ళ పరిస్థితులను మెరుగు పర్చటానికి తగు సూచనలు చేయమంది.

అలా వృషాకపి ఆ రోజు ఆ మహిళా జైలును సందర్శించాడు. కొంచెం తెల్లజుట్టుతో, కళ్ళ జోడుతో ఓ మహిళ తోటి ఖైదీలకు పనులు పురమాయిస్తూ కనిపించింది. ఈవిడనెక్కడో చూసినట్లుందే అనుకున్నాడు వృషాకపి. ఆ మాటే జైలరుతో అన్నాడు. ''ఆవిడా. ఆవిడ పేరు పుళింద. కోర్టువారు ఆవిడకు అత్తగారిని చంపినందుకు వురిశిక్ష విధించారు.'' వినయంగా విన్నవించాడు.

వృషాకపికి ఆశ్చర్యం వేసింది. తను శిక్ష వేసి పదిహేనేళ్ళయిపోయింది. పై కోర్టువారు శిక్ష తగ్గించారా? అనుమానం వచ్చింది. అదేమీ లేదండి. అన్ని కోర్టులూ ఉరిశిక్షే ఖాయం చేశాయి. రాష్ట్రపతి క్షమాభిక్ష నిరాకరించారు''

''అయితే ఉరి ఎందుకు తీయలేదు'' వృషాకపిని ఉత్సుకత వరదలా ముంచెత్తుతోంది.

జైలరు విషాదంగా మొహంపెట్టి పదిహేను సంవత్సరాల వయసుకల ఫ్లాష్ బేక్‌లోకి వెళ్ళాడు.

''అది శ్రావణమాసం. తెల్లవారు ఝాము. ఆకాశం నిండా మబ్బులు. నీళ్ళోడుతున్నాయి. శుక్రవారం. పుణ్యతిథి. ఉదయం 5 గంటలకు సుముహూర్తం నిర్ణయించారు. ఉరికి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాం. మేజిస్ట్రేట్ గారు, డాక్టరుగారూ వచ్చారు. తలారి తనపని ఎప్పుడా ఎప్పుడా అని తహ తహలాడుతూ మాటి మాటికీ అరచేతులు చూసుకుంటున్నాడు. సూది పడితే వినబడే నిశ్శబ్దం. ఆ నీరవ నిశ్శబ్దంలోంచి గడియారం గంటలు. ఒకటీ....''.

వృషాకపికి కోపం కట్టలు తెచ్చుకుంది. ''నీ సస్పెన్సు బొందలో మన్నుపొయ్యా. స్క్రీన్ ప్లే ఆపి అసలు సంగతేడువు'' కసిరాడు.

జైలరు కొనసాగించాడు. ''ఈవిడను ఉరికంబం దగ్గరకు తెచ్చాడు. తలంటు పోసుకొని తడారని కురులు తెల్లచీర ముఖం గంభీరంగా వున్నా కాస్త చెదురు మదురుగా భయమో –దిగులో తెలియదు కానీ''

వృషాకపికి మండుకొచ్చింది. వెంటనే ఏం జరిగిందో చెప్పకుంటే జైలరు చెంపలు వాయిస్తానని బెదిరించాడు.

''ఈవిడ ఒక్కసారి ఆకాశంలోని నక్షత్రాల వంక చూసి అత్తయ్యా. వస్తున్నా. మీ పని మళ్ళీ అక్కడ పడతా'' భీకరంగా కేక పెట్టింది.

''దీని పిచ్చి దొంగల్దోలా. ఇహ ఇది మారదు. ఉరికొయ్య దగ్గర కూడా అదే మాటా?'' వృషాకపి ఆశ్చర్యం అణుచుకోలేకపోయాడు.

జైలర్ గొంతులో విచారం చోటుచేసుకుంది. ''ఈవిడ మొగుడు రోజూ జైలు బైట సెంట్రీకి సిగిరెట్టో బీడో ఇచ్చి ఈవిడను వురి తీశారా లేదా వాకబు చేసేవాడు. ఇంకా లేదండీ అంటే ఎలా గయినా ఉరితీసేయండి. వదిలిపెట్టేరు కనుక. బాబ్బాబు. పుణ్యం ఉంటుంది'' అని బతిమాలేవాడట. అతను కనిపించక దాదాపు పదేళ్ళయింది.

వృషాకపికి నరాలు చిట్లుతున్నాయి. ఈ జైలరు అవసరమయింది తప్ప అన్నీ చెబుతున్నాడు. నసపెట్టక ఏం జరిగిందో చెప్పవయ్యా కసిరాడు.

జైలరు గొంతు సవరించుకున్నాడు. ''రూల్సు ప్రకారం ఉరికంబం ఎక్కించే ముందు ఈవిడ ఆఖరి కోరికేమిటో చెప్పమని అడిగాం''

''ఏం కోరిందేమిటి. ఐస్‌క్రీమా'' వృషాకపి ఆతృతగా అడిగాడు.

''ఛ. వానాకాలం తెల్లారగట్ట ఐస్‌క్రీమేమిటి? మీ బొంద''

వృషాకపి నాలుక్కరుచుకున్నాడు.

జైలరు కొనసాగించాడు.

''తనను వక్ర చక్రం – చక్ర వక్రం సీరియల్ అయిపోయిన మర్నాడే ఉరితీయమని ఆఖరి కోరిక కోరింది. పాపం. ఆడకూతురు. టి.వీ.సీరియల్ అంటే ఇష్టపడుతోంది. మహా అంటే ఇంకో అయిదారు నెలల్లో సీరియల్ అయిపోతుంది. ఈవిడ ఆత్మకు శాంతి కలగాలి. మా హిందుస్తానీ సూపరెంటూ కూడా భటక్‌తీహుయీ ఆత్మాయహపర్ నహీ ఆనా – ఆత్మాకు శాంతీదో – పరంతూ అంటూ ఏదో చెప్పబోయే సరికే అంతా సీరియల్ అయిందాకా ఆగుదామని నిర్ణయించేశాం. అదే కొంప ముంచింది. ఇప్పటికి పదిహేనేళ్ళయింది. ఇంకా అయిపోలేదు. మరో పదేనేళ్ళు ఈజీగా లాగుతుందని రేటింగ్సును బట్టి విజ్ఞులు చెబుతున్నారు.''

వృషాకపి దభీమని పడిపోయాడు. జైలరు అతని ముక్కు దగ్గర వేలు పెట్టి నిరాశగా పెదవి విరుస్తూ హంసలేచిపోయిందన్నట్లుగా సైగ చేశాడు.

*